# జగన్నాథ రథయాత్ర

## అడుగడుగునా విచిత్రం- ఆధ్యాత్మిక సందేశం



జగత్ప్రసిద్ధి గాంచిన పుణ్య క్షేత్రం పూరిలో అడుగడుగునా విచిత్రాలే గోచరిస్తాయి. ఏ దేవాలయానికెళ్లినా ఆలయంలోని దేవతలు వివాహితులయిన పక్షంలో పార్వతీ పరమేశ్వరులూ, లక్ష్మీనారాయణులూ అంటూ దంపతులుగానే కన్పిస్తారు.

ఐతే ఒరిస్సా రాష్ట్రంలో జిల్లా కేంద్రమైన పూరి (పురి క్షేత్రం) లో మాత్రం జగన్నాథుడు (కృష్ణుడు) సుభద్ర, బలరాముడనే ఈ ముగ్గురూ వివాహితులే అయినా వారి వారి భార్యలు/భర్తతో కాక వీరి ముగ్గురి మధ్య ఉన్న అన్నాచెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకలుగా కనిపిస్తారు. ఇదొక చిత్రం. ఏ ఉత్సవమైనా శుభ మాసాల్లో జరగడమనేది అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఐతే పూరిలో 'జగన్నాథ రథయాత్ర' పేరిట ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ ఉత్సవం మాత్రం మనందరం శూన్య మాసం అని పిలిచే ఆషాఢంలో జరుగుతుంది. ఇది మరో చిత్రం.

ఏ రథోత్సవంలోనైనా ఆలయంలో ఎందరు దేవతలుంటే అందర్నీ ఒకే రథంలో పెట్టి తీసుకుపోవడం కన్పిస్తుంది. అయితే ఈ క్షేత్రంలో మాత్రం గర్భాలయంలో ఉన్న ముగ్గురు దేవతలనీ మూడు వేర్వేరు రథాల్లో తీసుకుని వెళ్తారు. అలాగే ఉత్సవంలో రథం ఎక్కణ్ణించి బయల్దేరిందో, అక్కడికి అదే రోజున అంటే మర్నాడు సూర్యోదయంలోగా చేరి తీరాలనేది శాస్త్ర వచనం. అయితే ఈ ఉత్సవంలో బయల్దేరిన రథాలు, బయల్దేరిన రోజుకాక ఆ మీద తొమ్మిది రోజులకి బయల్దేరిన చోటుకి చేరుకుంటాయి.




శుభమైన ఓ ముహూర్తంలో పనిని ప్రారంభించి రథాన్ని తయారుచేసి దాన్ని ఓ మంచి ముహూర్తంలో దైవానికి శాశ్వతంగా సమర్పించాలనేది ఆగమం చెప్పిన పద్ధతి. ఐతే ఈ క్షేత్రంలో రథాలని రెండు నెలల కాలంలోనే నిర్మించి, ఒక్కసారికి మాత్రమే వాటిని ఉపయోగించి, మళ్లీ పై సంవత్సరానికి కొత్తరథాలని తయారు చేస్తుంటారు.

ఇవన్నీ చిత్రమైన అంశాలయితే, రథాల్లో యాత్ర చేసే మూడు విగ్రహాలూ చెక్కతో చేసినవి కావడం- వాటికి కూడా కాళ్ళూ చేతులూ పూర్తిగా చెక్కకుండా మొండివిగా కన్పిస్తూ అసంపూర్ణ విగ్రహాలుగా ఉండడం ప్రతి పన్నెండేళ్ళకీ మూలవిరాట్టులుగా ఉన్న ఈ మూడు విగ్రహాలనీ తొలగించి వాటిస్థానే కొత్తవాటిని ప్రతిష్ఠించడం, పాత విగ్రహాలని ఆలయానికి పక్కగా ఉన్న ప్రదేశంలో ఖననం చేయడం వంటివన్నీ విచిత్రాలే.

ఈ పైనకున్న చిత్రవిచిత్రాలలో రహస్యాలు తెలియాలంటే ముందుగా ఆలయాన్ని గురించీ- ఆ మీదట రథయాత్రనాడు జరిగే తంతుని గురించి కొంత తెలుసుకోవాలి!

### ఆలయం నిర్మాణం

ప్రపంచంలోని అనేక దేశాలనుంచి ఎప్పుడూ భక్తులు వచ్చిపోతూండే ఈ ఆలయం చుట్టూ ఎత్తైన బలిష్ఠమైన రాతిగోడ ఉంటుంది. ఈ ప్రాకారంలో ఉన్న ఆలయం, దుర్భేద్యమైన ఓ చక్రవర్తి కోటని తలపిస్తూంటుంది. విశాలమైన మెట్లమీదుగా ఆలయంలోనికి వెళ్ళగానే ఎదురుగా శ్రీ జగన్నాథుడు (కృష్ణుడు) ఆ పక్కన సుభద్ర, ఆమె పక్కన బలభద్రుడు (బలరాముడు) దర్శనమిస్తూ వివాహితైన ఓ చెల్లెలు పుట్టింటికొచ్చి అన్నదమ్ములమధ్య నిలబడ్డట్టుగా అన్పిస్తుంది.

చెక్కతో చేసిన ఈ విగ్రహాల ముంజేతులు, మణికట్టు, చేతివేళ్ళూ అలాగే పాదాలూ కాలివేళ్లూ లేకుండా అసంపూర్ణంగా కన్పిస్తుంటాయి. ఇలా ఉండడానికి ఓ ఐతిహ్యం చెబుతారు.

శాస్త్రం ప్రకారం ఇరవైయొక్క రోజుల్లో మూడు విగ్రహాలని చెక్కగల శిల్పి కోసం ఒకప్పుడు ఇంద్రద్యుమ్న మహారాజు దేశదేశాలూ చాటింపు వేయించాడు. ఎందరో శిల్పులు వచ్చారు. కొందరికి దారువులు (పెద్దకొయ్య బండలు లేదా దూలాలు) కన్పించలేదు.

మరికొందరికి చెక్కడం సాధ్యపడలేదు. మరికొంత మంది చెక్కబోతే సుత్తి ఉలి మొదలైన సాధనాలు దారువుకి తగలగానే విరిగిపోతూండేవి. చింతాక్రాంతుడైన రాజు ఆశయం నెరవేర్చడం కోసం భగవంతుడే 'అనంత మహారాణా' అనే పేరుతో, తానొక శిల్పినంటూ రాజు దగ్గరికొచ్చాడు. 'తాను చెక్కే సమయంలో ఎవరూ చూడబోమని చెప్పిన పక్షంలోనే పని' పూర్తి చేస్తానన్నాడు.



రాజు పనిని అప్పగించాడు. అనుకున్న నియమం ప్రకారం మూడు దుంగల్నీ, శిల్పినీ ఓ మందిరంలోకి పంపారు. చుట్టూ తలుపుల్ని మూసేశారు. మొదటి పదిరోజుల పాటు లోపల్నించి విగ్రహాలని చెక్కుతున్న చప్పుళ్ళు వినిపించాయి గాని ఆ తరువాత ఉలుకూ పలుకూ విన్పించలేదు రాజుకి.

ఆ శిల్పి మరణించాడేమో, చివరికి ఏ అప్రతిష్ఠ తనకి వస్తుందో, తన రాజ్యప్రజలకి ఏ ఇబ్బందులు కల్గుతాయోనని బలవంతాన పదహారో రోజున ఉండబట్టలేక రాజు తలుపుల్ని తెరిపించాడు. అంతే! ఇప్పుడు విగ్రహాలున్న తీరుగా అసంపూర్ణంగా విగ్రహాలు కన్పించాయి. 'మరో ఆర్రోజులూ ఆగి ఉంటే బాగుండే'దని తాను చేసిన తప్పుకి రాజు కుమిలిపోతుంటే. జగన్నాథుడే కలలో కన్పించి 'తనకి ఇలాగే సేవలందుకోవడం ఇష్ట'మన్నాడుట.

ఈ కారణంగానే ఈ దారు విగ్రహాలకి అసంపూర్ణ విగ్రహాలకి పూజా పునస్కారాలు జరుగుతూనే వుంటాయి. ఆలయంలోని నాలుగు విభాగాల్లో ఇది మొదటిది.

ఇక ఆ స్వామికి ఎదురుగా ఉండే విశాలమైన స్థలాన్ని దర్బారు ప్రదేశమంటారు. ఆ ముగ్గురినీ దర్శించడానికి వచ్చిన భక్తులు స్థిమితంగా కూర్చుని కీర్తనలనీ, పాటలనీ, భజనలనీ చేసేచోటన్నమాట. ఎక్కువగా ఒరియా, బెంగాలీభాషల్లో సాగే భజనలు కర్ణపేయంగా వుంటాయిక్కడ. ఇది రెండో విభాగం.

ఇక మూడో విభాగంలో ఏ రోజుకి ఆ రోజు స్వామికి ప్రసాదాన్ని తయారుచేసే స్థలం ఉంటుంది. ఇక్కడ నిత్యమూ అన్నప్రసాదం, శుష్కప్రసాదం అని రెంటిని సిద్ధం చేస్తుంటారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకి అక్కడికక్కడే తినిపోయేందుకు వీలుగా అన్న ప్రసాదం, ఇక ఇంటివద్ద ఉన్న బంధువులకి ఈ వచ్చినవాళ్ళు తీసుకుని వెళ్ళేందుకు శుష్కప్రసాదం ఇక్కడే తయారౌతుంటాయి.

ఒకే పొయ్యి మీద ఏడుకుండల్ని, ఒకదానిలోకి మరోటి దిగబడిపోకుండా ఉండేవీ, పైకి పోను పోను కింద కుండ కంటే కైవారం తక్కువైన కారణంగా తమ తమ కింది కుండని ఆధారం చేసుకుని వాటి మూతిమీదే ఉండేవీ అయిన ఏడుకుండల్ని పెట్టి అన్నింటిలోనూ ఒక లెక్క ప్రకారం బియ్యాన్నీ, నీటినీ పోసి ఒకేసారి మంటపెడతారు.పై నున్న కుండలో ఎలా ఉడికిందో అలాగే కిందనున్న కుండలోనూ అన్నం ఉడుకుతుంది.

ఇలాంటి పొయ్యిలు అనేకం ఉంటాయిక్కడ భక్తుల సంఖ్యని బట్టి. కొన్ని పొయ్యిలమీద ఇదే దొంతుల పద్ధతిలో ఒకేసారి పప్పూ పులుసూ కూడా చేస్తుంటారు. ఈ వింత వంటని చూసి తీరాల్సిందే.

భగవతుడికి అన్న ప్రసాదాన్ని నివేదన చేశాక తెచ్చే ఆ పెద్దపళ్ళాన్ని అక్కడ అర్చకులు (పండాలు) ఉంచగానే ఎవరిక్కావలసిన అన్నాన్నీ, తినుబండారాలనీ ఎవరికి వాళ్ళు 'ఎంగిలి' అనేది లేకుండా తినేస్తారు. 'సర్వం జగన్నాథ'మనే మాట ఇక్కడ పుట్టిందే.

అన్నం పప్పూ అయ్యాక ఆ పక్కనే ఓ పెద్ద భాండీలా విశాలమైన మూతివున్న పాత్రలో మజ్జిగ, దాంట్లో ఓ పాత్రా వుంటాయి. ఎవరిక్కావల్సినంత మజ్జిగని వాళ్ళు పాత్రతో తాగెయ్యవచ్చు. కరిచి పెట్టుకు తాగినా తప్పు లేదు. ఐతే ఆ పాత్రని మళ్ళీ మట్టిభాండీలో వేసి వెళ్ళిపోవాలి. ఇలా ఎందరికైనా ఎప్పుడొచ్చినా కాదనకుండా లేదనకుండా అన్నం దొరికే ఆలయం ఇదే.

అందుకే గాబోలు ఆ మధ్య విదేశీయుడొకడు భారత దేవాలయాల మీద వ్యాసం రాస్తూ 'భారత్‌లో ఎప్పుడూ డబ్బు కన్పించే బ్యాంకు ఒకటి (తిరుమల), ఎప్పుడూ అన్నం దొరికే హోటలొకటీ(ఈ క్షేత్రం) ఉన్నాయి. ఐతే తిండి ఎప్పుడూ ఉచితంగా తినడానికి ఉంటుంది తప్ప, బ్యాంకుని చూడ్డం వరకే పరిమిత' మన్నాట్ట.

ఇక నాలుగో విభాగంలో దేవుడికి సంబంధించిన అన్ని ఉత్సవాలూ నిర్వహిస్తుంటారు. వైశాఖంలో అక్షతదియ, జ్యేష్ఠమాసంలో స్నానయాత్ర, ఆషాఢంలో ఇప్పుడనుకుంటున్న రథయాత్ర, భాద్రపదంలో పార్శ్వపరివర్తనం, కార్తీకంలో దేవోత్థాపనం. మార్గశిరంలో శ్రవణ షష్ఠి, పుష్యంలో మకరసంక్రాంతి, ఫాల్గుణంలో డోలా యాత్ర.... ఇలా వైభవంగా
సాగుతాయి.

పధ్నాలుగు సంవత్సరాల పాటు కట్టిన ఈ ఆలయానికి నిర్మాత అలనాటి ఒరిస్సా రాజు అనంగ భీమ దేవుడు. దేవాలయమ్మీద ఎప్పుడూ పెద్ద దైవ ధ్వజం ఎగురుతూ వుంటుంది. ప్రాకారంలో చిన్న చిన్న దేవాలయాలు అనేకం వుంటాయి. దేవాలయం గోడలమీద శిల్పవిన్యాసం చూపరులను ఎంతో ఆకట్టుకుంటుంది.

## ఆషాఢంలోనే రథయాత్ర



ఆషాఢస్య ద్వితీయాయాం రథం కుర్యాత్ విశేషతః
ఆషాఢ శుక్లైకాదశ్యాం జప హోమ మహోత్సవమ్
రథస్థితం ప్రజంతం తం మహాదేవం మహోత్సవే
యే పశ్యంతి ముదా భక్త్యా తేషాం వాసః పదే హరేః

అని పద్మపురాణం చెప్పింది. ఈ ప్రమాణం ప్రకారం జరిగే రథయాత్రని చూద్దాం.

వైశాఖ శుద్ధ తదియనాడు (అక్షయ తదియ) ప్రారంభించిన రథాల నిర్మాణం ఆషాఢ శుద్ధ విదియకి పూర్తి అవుతుంది. జగన్నాథుడూ బల భద్రుడూ సుభద్రా ఎక్కే రథాలకి నంది ఘోషం-తాళధ్వజం -దేవదళనం అని పేర్లు.

పూరీ క్షేత్రపు రాజు ఈ ఆషాడ శుద్ధ విదియనాడు తన కిరీటాన్ని తీసి నేలన పెట్టి మంచి గంధపు నీటితో రథాలని కడుగుతాడు. రథాలు ప్రయాణించాల్సిన రాజ వీధి (బడాదండ) ని స్వయంగా తానే బంగారు చీపురుతో కొంత మేర ఊడుస్తాడు. దీన్నే ఒరియాలో 'చేరా పహన్‌రా' అంటారు. రథాలు బయలుదేరడానికి ఓ పూట ముందే లక్షల సంఖ్యలో దేశ విదేశీ భక్తులు రాజవీధిలో ఇసకేస్తే రాలనంతగా నిండిపోతారు.

భక్తులంతా రథాలకి ఇటూ అటూ కట్టిన తాళ్లని పట్టుకుని మెల్లగా లాగుతూ కీర్తనలు, పద్యాలు, పాటలు పాడుతూ ఈ దేవతలందరి పిన్ని ఇంటికి (గుండీచ ఘర్) తీసుకొచ్చి రథాల్ని ఓ పక్కన నిలిపి విగ్రహాలని ఆ లోపలికి తరలిస్తారు. ఇంతవరకూ జరిగిన ఈ యాత్రని 'గుండీచ యాత్ర' అంటారు.

ఈ రోజుకాకుండా ఆ మీద వచ్చే తొమ్మిదో రోజున మళ్ళీ ఇలాగే ఆ ముగ్గురు మూర్తులకీ పూజ, చందనచర్చ చేసి మళ్ళీ అందరు భక్తుల సమక్షంలో తిరిగి ప్రధానాలయానికి తెస్తారు. దీన్ని 'బహుదా యాత్ర' అంటారు. ఇక ఈ రథాలని దేనికీ వాడరు.

ఈ విదియనాటి నుండి ఏకాదశి వరకూ అంటే గుండీచ, బహుదా యాత్రలు రెండూ ఆరంభమై అంతమయ్యే పదిరోజులపాటూ పూరీ జగన్నాథస్వామి ఆలయం మీద రోజుకి ఓ ధ్వజం చొప్పున ఒక రజకుడు గోపురాన్నెక్కి మారుస్తూ ఉంటాడు.

ఈ ఉత్సవం అయిపోయాక దేవాలయం వెనకఉన్న శ్వేత గంగ, నరేంద్రకోన, ఇంద్రధన్యు, మార్కండ, నీలాచలజల అనే అయిదు చెరువుల్లో ఎవరికి వీలైనచోట వాళ్లు స్నానాలు చేస్తారు.

ఈ రోజుల్లో ఈ రథయాత్రలో ఉన్న దైవాన్ని చూస్తే పునర్జన్మ ఉండదనీ పాపాలు తొలగి మోక్షం వస్తుందనీ పురాణం చెప్పడంతో నలభై ఏడడుగుల ఎత్తూ, ముప్పై మూడడుగుల చదరమూ ఉండి, ఏడడుగుల వ్యాసంతో వున్న పదహారు చక్రాల రథాలని సామాన్యమయిన గుర్రబ్బండిని లాగినంత తేలికగా భక్తులు అంతదూరమూ తీసికెళ్తారు- తిరిగి తెస్తారు కూడా.

## రథయాత్ర ఎందుకు?

ఎప్పుడూ మనమే భగవంతుని దగ్గరికి వెళ్లడంకాక, ఆయన కూడా ఓ సారి మనల్ని చూడరావడమే రథ యాత్రంటే.

మన భక్తి కారణంగా మాత్రమే అంత పెద్ద భగవంతుడు కూడా తన స్థాయిని మరిచి మనదగ్గరి కొస్తాడని దీనిద్వారా గ్రహించాలి. విశ్వరూపమెత్తి తాళ్ళకి కట్టుబడని కృష్ణుడు యశోదమ్మ మూరెడు తాటికి కట్టుబడడానిక్కారణం శక్తేకదా మరి!

ఈయన పేరు 'జగత్ నాథు'డని, ''జ- జన్మించేదీ, గ-గతించేదీ' అనే లక్షణాలున్న ప్రాణికోటి నిండిందేదో అదే జగత్తంటే(జాయతే గుచ్ఛతీతి జగత్) అలాంటి ప్రాణికోటికి ప్రభువైన ఈ స్వామి చెక్కరూపంలో చెక్కరథంలో వచ్చి తొమ్మిదిరోజులుండి పదవరోజున వెళ్ళిపోతున్నాడు గదా! ఇక్కడే విశేషం వుంది.

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ చ
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహ ఏవ చ
ఇంద్రియాణి హయావ్యాహుః
ఇంద్రియేభ్యః పరం మనః
మనసస్తు పరాబుద్ధిః బుయద్దే ర్యః పరతరస్తు సః

ప్రతి వ్యక్తి శరీరమూ కూడా చెక్క రథం లాంటిదే. దైవం ఉన్నంతసేపూ రథానికెలా గౌరవప్రతిష్ఠలూ పూజా పురస్కారాలూ లభించాయో, అదేవిధంగా ఈ శరీర రథంలో కూడా ఉచ్ఛ్వాస నిశ్వాస రూపంలో ప్రాణమనే భగవంతుడున్నంత వరకూ ఈ శరీరానికి కదలిక, గౌరవం, ఆనందం వంటివి వుంటాయి.

## యాత్ర పరమార్థం

వివాహితులై ఎవరి తోవన వారు వెళ్లడమే, ఆ రథాలు వేర్వేరుగా ప్రయాణించడానికి సంకేతం. ఐతే భార్యా భర్తలు మాత్రమేకాక సోదర సోదరీ సంబంధాన్ని పుట్టింట మరువద్దని చెప్పడానికి ప్రతీక ఈ ముగ్గురిదర్శనం. ఒక చోట తొమ్మిది రోజులుండి, పదవనాటికి తిరిగి యథాస్థానానికి రావడమంటే తల్లి గర్భంలో తొమ్మిది నెలలుండి పదవనెలలో బైటికి రావడమన్నమాటే. పుట్టిన ప్రాణికీ ముఖ్యం మరేదీ కాదు తిండీ - నీరూ అని తెలియ జెప్పటమే నిత్యాన్నప్రసాద సంతర్పణ లక్ష్యం.

సంస్కృతంలో 'పూః' అనే ఓ శబ్దం వుంది. దానికి శరీరం అని అర్థం.

'పురి జగన్నాథ రథయాత్ర' అంటే- ఈ శరీరంలో(పుర్శిఇ) జగన్నాథుడు వున్నాడని గమనించి, ఆ కారణంగా నా శరీరం అనే రథం నడుస్తోందని గమనింపజేయడన్నమాట. ఏ సంవత్సరానికా సంవత్సరం రథాన్ని మార్చడమంటే ఏ జన్మకాజన్మకి, జీవి తన ఉపాధిని మార్చడమన్నమాట. ఈ సారి ప్రాణిగా పుడితే పైసారికి మరో ప్రాణిగా పుట్టడమన్నమాట.

మొత్తానికి తెలియవలసిందేమంటే 'జగన్నాథ రథయాత్ర అంటే వ్యక్తి శరీర జీవనయాత్ర' అని. ఈ శరీరం శాశ్వతం కాదనీ, ఉన్నంతకాలం భగవదారాధనతో సద్వినియోగంచేసుకోవాలనీ, ఆ కారణంగా మంచి రథాన్ని(శరీరాన్ని) పొంద వీలౌతుందనీ తెలియ జెప్పడం యాత్ర లక్ష్యం.